
సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



వంతెన నిర్మించేనా?
సదాశివనగర్‌లోని అమర్లబండ వద్ద వంతెన నిర్మాణం కలగానే మిగిలింది. వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.
- 9లో ▸



వేడెక్కిన రాజకీయం
నాగిరెడ్డిపేట ఎంపీపీ ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదలయ్యింది. 28న ఎన్నిక నిర్వహించనున్నారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0 /15.0
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

నేడు బల్దియా బడ్జెట్ సమావేశం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో బడ్జెట్ సమావేశం ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం 3 గంటల వరకు సాదారణ సర్వసభ్య సమావేశం కొనసాగుతుందని పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

'జీవాల పెంపకంతో ఆర్థికంగా ఎదగాలి'



తాడ్వాయి: గొర్రెలు, మేకలను పెంచి, ఆర్థికంగా ఎదగాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సింహారావు సూచించారు. గురువారం చిట్యాల రైతు వేదికలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలు, పాడి పశువుల పెంపకందారులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సింహారావు మాట్లాడుతూ జీవాల పెంపకంలో రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో గొర్రెలు, మేకల షెడ్‌లు నిర్మించుకునే అవకాశం ఉంటుందన్నారు. గొర్రెలు, మేకలలో వచ్చే వ్యాధుల గురుంచి తాడ్వాయి పశు వైద్యాధికారి రామచంద్రం వివరించారు. కార్యక్రమంలో ఏడీ సుభాష్, రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజు, ప్రోగ్రాం ఆఫీసర్ శ్వేత, గోపాల మిత్ర బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా సంధ్య



కామారెడ్డి టౌన్: బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ భుక్యా సంధ్య నియమితులయ్యారు. ఈ విషయాన్ని మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర కమిటీతో పాటు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతారకు సంధ్య కృతజ్ఞతలు తెలిపారు.

ధర్నా చౌక్ మార్పు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలో ప్రస్తుతం ఉన్న ధర్నా చౌక్‌ను వేరేప్రాంతంలోకి మార్చినట్లు సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పాత కలెక్టరేట్ వద్దనుంచి పాత ఎంపీడీవో కార్యాలయం స్థలంలోకి మార్చామని పేర్కొన్నారు.

వడ్డీ దందాపై నజర్!

జిల్లాలో అక్రమ వడ్డీ వ్యాపారంపై పోలీసులు దృష్టి సారించారు. గురువారం పలు ప్రాంతాలలో దాడులు నిర్వహించారు. వ్యాపారుల వద్దనుంచి డాక్యుమెంట్లు, రికార్డులను స్వాధీనం చేసుకుని, విచారణ జరుపుతున్నారు. జిల్లా అంతటా ఏకకాలంలో దాడులు జరగడం సంచలనం సృష్టిస్తోంది. – సాక్షి, కామారెడ్డి



లింగంపేటలోని ఓ ఫైనాన్స్‌లో రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

- పలు ప్రాంతాలలో పోలీసుల దాడులు
- రికార్డులు, డాక్యుమెంట్లు స్వాధీనం
- వడ్డీ వ్యాపారుల్లో గుబులు

జిల్లాలో ఎలాంటి అనుమతులు పొందకుండానే చిట్స్, ఫైనాన్స్ వ్యాపారాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. అక్రమ ఫైనాన్స్, చిట్స్ దందాలో కొందరు కోట్లకు పడగలెత్తగా, మరికొందరు భాగస్వాముల మోసం, మేనేజర్ల నిర్వాకాలతో రోడ్డున పడ్డారు. అయితే ఫైనాన్స్, చిట్స్ దందాలో అడ్డగోలు వడ్డీలతో ప్రజల నడ్డి విరిచి ఎదిగిన వాళ్లు అప్పులు ఇవ్వడం తగ్గించి, ఇతర వ్యాపారాల్లో ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టారు.

చితికిన బతుకులెన్నో..

జిల్లా కేంద్రంలో గతంలో వందలాది చిట్స్, ఫైనాన్స్‌లు నడిచేవి. పదిమంది నుంచి ఇరవై మంది కలిసి ఓ గ్రూప్‌గా ఏర్పడి వ్యాపారం చేసేవారు. ఫైనాన్స్ నిర్వాహకుడి(మేనేజర్)గా భాగస్వాముల్లో ఒకరు వ్యవహరించేవారు. ఆయన మరికొందరితో మరికొన్ని ఫైనాన్స్‌లు కూడా నిర్వహించేవారు. పెద్ద మొత్తంలో డబ్బులు రొటేషన్ అయ్యేవి. అలాంటి సమయంలో కొందరు ఫైనాన్స్ నిర్వాహకులు పెద్ద మొత్తంలో డబ్బులతో ఉడాయించిన సంఘటనలున్నాయి. అలాగే కొందరు దివాలా పేరుతో ఐపీ పెట్టిన సంఘటనలూ ఉన్నాయి. ఉడాయించిన వారితో పాటు ఐపీ పెట్టిన వారి మూలంగా నష్టపోయిన ఒకరిద్దరు బాధితులు ఆత్మహత్య చేసుకున్నారు. మరెందరో ఇబ్బందుల పాలయ్యారు. ఫైనాన్సుల్లో పెట్టుబడులు పెట్టి చాలామంది నష్టపోయారు. అప్పులు తీసుకున్నవారూ అధిక వడ్డీలు చెల్లించలేక ఇబ్బందిపడుతున్నారు.



జిల్లా కేంద్రంలో తనిఖీ చేస్తున్న సీఐ చంద్రశేఖర్

జిల్లావ్యాప్తంగా దాడులు...

అనుమతులు లేకుండా ఫైనాన్స్‌లు నిర్వహిస్తూ అడ్డగోలుగా వడ్డీలు వసూలు చేస్తున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. కొందరు వ్యాపారులు

అడ్డగోలు వడ్డీలతో..

జిల్లావ్యాప్తంగా అక్రమ వడ్డీ వ్యాపారం భారీ మొత్తంలో నడుస్తోంది. కొందరు వడ్డీ వ్యాపారులు అడ్డగోలుగా వడ్డీలు వసూలు చేస్తున్నారు. దీంతో అవసరానికి అప్పులు తీసుకున్నవారు తిరిగి చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చిన అప్పులను రికవరీ చేయడానికి అప్పిచ్చినవారు జబర్దస్తీకి దిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కొందరు అడ్డగోలు వడ్డీలతో ఆర్థికంగా చితికిపోయి రోడ్డున పడ్డారు. అప్పుల వసూళ్ల కోసం కొందరు వ్యాపారులు ఆస్తులు రాయించుకున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. మరికొందరు తనఖా పెడితేనే అప్పులు ఇస్తున్నారు. సకాలంలో చెల్లించని వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నారు.

డాక్యుమెంట్లు సీజ్

ఎల్లారెడ్డి/లింగంపేట: ఎల్లారెడ్డి, లింగంపేట మండల కేంద్రాలలోని ఫైనాన్స్‌లపై గురువారం పోలీసులు దాడులు చేశారు. ఆయా ఫైనాన్స్‌ల నుంచి రికార్డులు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. వారి ఇళ్లలో లభించిన నగదును కూడా సీజ్ చేసినట్లు సమాచారం.

ఇచ్చిన అప్పులను వసూలు చేసుకునేందుకు జబర్దస్తీకి దిగిన సంఘటనలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ సింధు శర్మ చర్యలు చేపట్టారు. జిల్లాలో అక్రమ ఫైనాన్స్‌ల గురించి ఆరా తీసి, వడ్డీ దందా నిర్వహిస్తున్న వారి ఇళ్లపై దాడులు మొదలుపెట్టారు. గురువారం జిల్లాలో ఏకకాలంలో పలుచోట్ల దాడులు నిర్వహించి వడ్డీ వ్యాపారుల ఇళ్ల నుంచి డాక్యుమెంట్లు, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. దీంతో వడ్డీ వ్యాపారుల్లో గుబులు మొదలైంది. కొందరు పోలీసులకు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. జిల్లా కేంద్రంలో భారీ ఎత్తున ఫైనాన్స్, చిట్స్ దందా నడుస్తోంది. వారం తా సర్దుకున్నట్టు తెలుస్తోంది.

14 కేసులు నమోదు చేశాం

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తున్నవారిపై గురువారం దాడులు చేసి, 14 కేసులు నమోదు చేశామని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. కొందరు వ్యక్తులు, వ్యాపారులు అమాయక ప్రజలను చూసి ఆర్థిక సహాయం చేస్తామని వారి వద్ద నుంచి ఇళ్లు, ప్లాట్లు, వ్యవసాయ భూముల దస్తావేజులు తీసుకుని అప్పులు ఇస్తున్నారన్నారు. అధిక వడ్డీ లెక్కలు వేసి, డబ్బులు చెల్లించకపోతే ఆస్తులను జప్తు చేస్తున్నారని విచారణలో తేలిందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు చేపట్టి ఆధారాలను పరిగణనలోకి తీసుకుని అక్రమ వ్యాపారులు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 14 కేసులు నమోదు చేశామని, 184 ప్రామిసరీ నోట్లు, 12 చెక్కులు, 12 పాస్‌బుక్కులు, తనఖా పత్రాలు సీజ్ చేశామని వివరించారు. అక్రమ వడ్డీ వ్యాపారులు చేస్తున్న ఆర్థిక మోసాలను తట్టుకోలేక ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇలాంటి ఆత్మహత్యలను నివారించాలనే ఉద్దేశంతో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వడ్డీ వ్యాపారులపై దాడులు చేశామని పేర్కొన్నారు.

ఆక్వాకల్చర్ లాభదాయకం

- మహిళా సంఘాలకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



కొర్రమీను చేపను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: ఆక్వాకల్చర్ ఎంతో లాభదాయకమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొర్రమీను చేపలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. వ్యవసాయ క్షేత్రంలోని కొంత స్థలంలో ట్యాంక్, ఫాంపాండ్‌లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వ్యవసాయంతో పాటు కొర్రమీను చేపల పెంపకం కూడా చేపట్టవచ్చని సూచించారు. తద్వారా ఏడాదిలో మూడు సార్లు ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. ట్యాంక్, ఫాంపాండ్‌ల నిర్మాణానికి రూ. 5 లక్షలు ఖర్చు అవుతుందని నాబార్డ్ అంచనా వేసిందన్నారు. పీఎంఈజీపీ పథకం కింద 35 శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. జిల్లాలోని 16,957 మహిళా సంఘాలలో 1,75,670 మంది సభ్యులు ఉన్నారన్నారు. వారిలో చేపల పెంపకానికి ముందుకొచ్చిన 656 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఇప్పటివరకు 63 యూనిట్లు మంజూరు చేశామని తెలిపారు. జిల్లాలో వెయ్యి యూనిట్లు గ్రౌండింగ్ చేయడమే లక్ష్యమన్నారు. సమావేశంలో నాబార్డు సహాయ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, డీపీఎం రమేష్ బాబు, జిల్లా మత్స్య శాఖాధికారి వరదారెడ్డి, ఆక్వా కల్చర్ సాంకేతిక సలహాదారు, ఏపీఎంలు, సీసీలు, మహిళా సమాఖ్య సభ్యులు, మత్స్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు నిర్వహించే ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19,509 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఇందుకోసం 37 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సంబంధిత అధికారులు వెంటనే పరీక్ష కేంద్రాలను సందర్శించాలన్నారు. ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు, వెలుతురు లాంటి మౌలిక సదుపాయాలను పరిశీలించి, నివేదిక అందించాలని సూచించారు. ఆ నివేదిక ఆధారంగా సౌకర్యాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలని సూచించారు. సమావేశంలో ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, పరీక్షల విభాగం అధికారులు పాల్గొన్నారు.

విధులపై అవగాహన కలిగి ఉండాలి

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికలలో విధులు నిర్వహించే అధికారులకు తమ విధులపై పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఎంసీసీ, ఎంసీఎంసీ బృందాల అధికారులు, సి-విజిల్, సువిధ, కంట్రోల్ రూమ్, కాల్ సెంటర్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీ-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బు, మద్యం, కానుకలు పంపిణీ చేయడం, అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించడంలాంటి సమాచారం వస్తే వెంటనే క్షేత్ర స్థాయిలో ఉండే బృందాలకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలపై అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఎన్నికల పర్యవేక్షకులు జ్యోతి, అనిల్ కుమార్, ఎన్నికల బృందాల అధికారులు పాల్గొన్నారు.

గొర్రెల కొనుగోలు స్కాంలో ఏసీబీ దూకుడు

- కామారెడ్డిలో పనిచేస్తున్న వెటర్నరీ ఏడీతో సహా నలుగురి అరెస్ట్

సాక్షి, కామారెడ్డి: గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా ప్రకాశం జిల్లాలో గొర్రెలను కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన వ్యవహారంలో ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. ఈ వ్యవహారంలో నలుగురు అధికారుల ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలడంతో వారిని గురువారం అరెస్ట్ చేశారు. అందులో ప్రస్తుతం కామారెడ్డి పట్టణంలోని వెటర్నరీ ఆస్పత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రవి ఉన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ రవి సిద్దిపేటలో పని చేసిన సమయంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సంబంధించి గొర్రెల కొనుగోలు బాధ్యతలు చూశారు. గొర్రెలు అమ్మిన వ్యక్తులకు కాకుండా వేరే వ్యక్తి ఖాతాలో 130 యూనిట్లకు సంబంధించిన డబ్బులు రూ.2.10 కోట్లు జమ చేసి అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఏసీబీ విచారణ చేపట్టింది. విచారణలో నలుగురు అధికారుల ప్రమేయం ఉందని తేలడంతో వారిని గురువారం అరెస్ట్ చేశారు.

3,97,909 ఎకరాల్లో యాసంగి సాగు

- అత్యధిక విస్తీర్ణంలో వరి..
- జిల్లాలో పూర్తి కావచ్చిన పంటల నమోదు ప్రక్రియ



కామారెడ్డి క్రైం: యాసంగి పంటల నమోదు ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. జిల్లావ్యాప్తంగా 3,97,909 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఎప్పటిలాగే ఈ యాసంగిలోనూ అత్యధిక విస్తీర్ణంలో వరి పంట సాగయ్యింది. ఈసారి జొన్న సాగు గణనీయంగా పెరిగింది.

వరి సాగులో స్వల్ప తగ్గుదల..

జిల్లాలో గత యాసంగి సీజన్‌లో 4.14 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఆ సీజన్‌లో 2.70 లక్షల ఎకరాల్లో వరి వేశారు. ఈసారి 2,39,515 ఎకరాల్లోనే వరి సాగయ్యింది. అంటే గతేడాదితో పోలిస్తే 30 వేల ఎకరాల్లో వరి సాగు తగ్గింది. వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాయి. ఖరీఫ్‌లో వరి సాగు జోరుగా సాగింది. కానీ వానాకాలం చివరలో వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో ప్రస్తుత వేసవి ప్రారంభంలోనే చెరువుల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. చాలాచోట్ల వ్యవసాయ బోర్లు కూడా ఎత్తిపోతున్నాయి. ఆయా కారణాలతో వరి సాగు విస్తీర్ణం తగ్గింది.

పెరిగిన జొన్న.. తగ్గిన శనగ..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ యాసంగిలో జిల్లాలోని రైతులు జొన్నసాగుపై ఆసక్తి చూపించారు. గత యాసంగిలో 17,774 ఎకరాల్లో జొన్న పంట వేయగా.. ఈసారి ఏకంగా 37,708 ఎకరాల్లో జొన్న వేశారు. గత యాసంగిలో 87,180 ఎకరాల్లో శనగ పంట సాగవగా.. ఈసారి 64,552 ఎకరాలకు పడిపోయింది. రైతులు శనగ పంట తగ్గించి జొన్న వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

జిల్లాలో సాగవుతున్న పంటల వివరాలు..

వరి	2,39,515
మక్క	39,725
జొన్న	37,708
శనగ	64,552
పొద్దుతిరుగుడు	5,449
మినుము	1,778
రాజ్మా బీన్స్	2,463
ఇతర పంటలు	6,719
మొత్తం	3,97,909

సూచనలు పాటించాలి



జిల్లాలో పంటల నమోదు ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. ఎప్పటిలాగే ఈసారి యాసంగిలో కూడా వరి ప్రధాన పంటగా ఉంది. ఇతర పంటలు కూడా సాగవుతున్నాయి. రైతులు పంటల సాగు విషయంలో స్థానికంగా ఉండే వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి, మంచి దిగుబడులు సాధించాలి.
– భాగ్యలక్ష్మి, డీఏవో, కామారెడ్డి

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇన్‌చార్జీల పాలన

- ఉమ్మడి జిల్లాలో ఐదుగురే రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్లు
- అందులో ఇద్దరు సెలవులో..
- సీనియర్ అసిస్టెంట్లతో నెట్టుకొస్తున్న అధికారులు



సుభాష్‌నగర్: రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌చార్జీల పాలనలో కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో 10మంది సబ్‌రిజిస్ట్రార్లకుగాను ముగ్గురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మరో ఇద్దరు వివిధ కారణాలతో సెలవులో వెళ్లారు. రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్లతో నెట్టుకొస్తున్నారు. ఉద్యోగుల ప్రమోషన్లు లేకపోవడం, నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయకపోవడం సబ్ రిజిస్ట్రార్ల కొరతకు కారణమని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. పదేళ్లలో రెండుసార్లు మాత్రమే ప్యానల్ తీసి ప్రమోషన్లు ఇచ్చారు. ప్రమోషన్ల విషయంలో కొత్త ప్రభుత్వంపై ఉద్యోగులు ఆశలు పెట్టుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు!

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లు రాజ్యమేలుతున్నారు. లే అవుట్, నాన్ లే అవుట్ నిబంధనలను తుంగలో తొక్కి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ఇంటిస్థలం, ఇళ్ల రిజిస్ట్రేషన్లను ఇద్దరు, ముగ్గురిపై చేస్తుండడం గమనార్హం. ఇళ్ల స్థలాల ధరలు ఆకాశాన్నంటిన తరుణంలో ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్లు చేస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు కూడా గండిపడుతోందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఫిర్యాదులు వస్తేనే మెమోలు, సస్పెన్షన్లు ఉంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లా రిజిస్ట్రార్ కూడా..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. నిజామాబాద్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, దోమకొండ, బిచ్కుందలో ఉన్నాయి. 10మంది సబ్ రిజిస్ట్రార్ స్థాయి అధికారులు ఉండాల్సి ఉండగా, నిజామాబాద్, ఆర్మూర్, ఎల్లారెడ్డిలో మాత్రమే రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు విధులు నిర్వర్తిస్తున్నారు. బోధన్, కామారెడ్డి సబ్‌రిజిస్ట్రార్‌లు సెలవులో ఉన్నారు. మిగతా చోట్ల సీనియర్ అసిస్టెంట్ల ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపడుతున్నారు. చివరకు జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) కూడా ఇన్‌చార్జినే కొనసాగుతున్నారు.

నూతన ప్రభుత్వంపై ఆశలు

రిజిస్ట్రేషన్ శాఖలో ప్యానల్ తీయకపోవడంతో ప్రమోషన్లు నిలిచిపోయాయి. దీనికి తోడు నోటిఫికేషన్లు లేకపోవడంతో ఖాళీలు భర్తీ చేయడం లేదు. దీంతో శాఖలో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతోంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రెండు సార్లు మాత్రమే ప్రమోషన్ ప్యానల్ తీశారు. నూతన ప్రభుత్వం ప్రమోషన్ ప్యానల్‌పై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిసింది. త్వరలోనే ప్రమోషన్లు ఇస్తారనే ఆశలో ఉద్యోగులు ఉన్నారు. ఒకవేళ ప్రమోషన్లు ఇస్తే ఉమ్మడి జిల్లాలోని అన్ని కార్యాలయాలకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు వస్తారని వారు పేర్కొంటున్నారు.

ప్లాస్టిక్ బాటిల్స్‌లో దగ్గు మందు అమ్మకాలపై ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్లాస్టిక్ బాటిల్స్‌లో దగ్గు మందు అమ్మకాలతో వినియోగదారులు, చిన్నపిల్లల ఆరోగ్యానికి హాని కల్గుతుందని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. ఈ మేరకు గురువారం వినియోగదారుల మండలి ప్రతినిధులతో కలిసి నిజామాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. చక్రపాణి మాట్లాడుతూ అనేక రకాల దగ్గు మందులు ప్లాస్టిక్ బాటిల్స్‌లో ఉండడంతో పాటు సరైన స్టోరేజ్ లేక వేడిమికి కరిగిపోయి ప్లాస్టిక్ అవశేషాలు దగ్గు మందులో కలిసిపోతున్నాయన్నారు. దగ్గు మందు రెండేళ్ల పాటు నిల్వ ఉంచేందుకుగాను ఆయా సంస్థలు మందులో ఎక్కువ శాతం డీఈజీ కలుపుతున్నట్లు ఆరోపించారు. దీంతో హానికర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల మండలి ప్రతినిధులు పెందోట అనిల్‌కుమార్, సందు ప్రవీణ్, వీఎన్ వర్మ, కె సాయికుమార్, బాణోత్ సందీప్, నీరడి అనిత, మహదేవ్ శ్రీనివాస్ ఉన్నారు.



ఫిర్యాదు అందిస్తున్న మండలి ప్రతినిధులు

ఏషియన్ అథ్లెటిక్స్‌లో కాంస్యం



నిజామాబాద్‌నాగారం : ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో లాంగ్ జంప్‌లో విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న దినేశ్ కాంస్య పతకం సాధించారు. థా యిలాండ్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో గురు వారం ఆయన పతకం గెలుపొందారు. దినేశ్‌ను స్పోర్ట్స్ సెక్రెటరీ గంగారాం నాయక్, తోట రాజశేఖర్, సురేష్ అభినందించారు.

క్లుప్తంగా

పాశ్చాత్య సంస్కృతిని పారదోలాలి

● హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి



రెంజల్: యువత పాశ్చాత్య సంస్కృతిని పారదోలి, భారత సాంప్రదాయాలను పెంపొందించుకునాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి అన్నారు. మండలంలోని బాగేపల్లిలో అభీష్ట సీతారామ చంద్రస్వామి, హనుమాన్ శివ పంచాయతన, నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను మూడు రోజులుగా చేపట్టారు. చివరి రోజైన గురువారం విద్యారణ్యభారతి స్వామితో పాటు మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు. ఈ వేడుకలతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సాయాగౌడ్, గోపాల్, గ్రామ పెద్దలు సాయిబాబాగౌడ్, పాముల గంగాధర్, సురేందర్‌గౌడ్, రవిగౌడ్, గణపతి, అబ్బయ్య, సుదర్శన్, సాయిలు, చిన్నయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్చి 5 నుంచి బీఈడీ సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మార్చి 5 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌లను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

తెలుగు బీవోఎస్ చైర్మన్‌గా లక్ష్మణ చక్రవర్తి



తెయూ: తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) చైర్మన్‌గా డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి నియామకమయ్యారు. తెయూ ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి లక్ష్మణ చక్రవర్తికి నియామక ఉత్తర్వులను గురువారం అందజేశారు. అనంతరం లక్ష్మణ చక్రవర్తిని పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

సీపీ ఆఫీస్‌కు ఐదో టౌన్ ఎస్సై అటాచ్

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదోటౌన్ ఎస్సై అప్పారావును సీపీ కల్మేశ్వర్ సీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఖిల్లా రామాలయానికి చెందిన గేటుకు కలర్ వివాదంలో ఎస్సైపై ఫిర్యాదులు రావడంతో అటాచ్ చేసినట్లు తెలిసింది.

ఇంద్రజాలంలో ఆణిముత్యాలు..

- రుగ్మతలను రూపుమాపుతున్న ఇందూరు మెజీషియన్ రంగనాథ్
- నేడు ప్రపంచ ఇంద్రజాల దినోత్సవం



కలెక్టర్ రాజీవ్‌గాంధీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జాదూ రంగనాథ్ (ఫైల్)

నిజామాబాద్ సిటీ: చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా కళ్లప్పగించి సంభ్రమాశ్చర్యాలకు గురవుతూ మధ్య మధ్యలో చప్పట్లు కొడుతూ ఆసక్తిగా తిలకించే ప్రదర్శన ఇంద్రజాలం. అతి ప్రాచీన భారతీయ కళ ఇది. కోల్‌కతాలో పుట్టి తన ఇంద్రజాలంతో ప్రపంచాన్ని సమ్మోహనం చేసిన సీనియర్ పీసీ సర్కార్ జయంతిని అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి 23న జరుపుకొంటున్నాం. సర్కార్‌ను ఆదర్శంగా తీసుకొని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంద్రజాలికులు తమదైన శైలిలో ప్రదర్శనలు నిర్వహిస్తూ అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు ఈ ఇంద్రజాల ఆణిముత్యాలు.

ఇందూరులో జాదూ రంగనాథ్..

మూఢనమ్మకాల ముసుగులో బాణమతి, చేతబడి, అనేక రుగ్మతులపై ప్రజల్లో ఉన్న అపోహల నుంచి ఇంద్రజాలం అనే కళతో సామాన్య ప్రజలను చైతన్య పరుస్తున్నాడు ఇందూరు జాదు యుగందర్ రంగనాథ్. తన 40 ఏళ్ల ఇంద్రజాల ప్రస్థానంలో 12 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి ఇందూరు పట్టాభి రాంగా పేరు లిఖించుకున్నారు. 64 కళలలో ఇంద్రజాలం ఒకటి. ఈ కళ ద్వారా ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా భ్రమింపజేస్తూ ప్రేక్షకులను మరో లోకాల్లో విహరింపజేస్తున్నారు.

ఉద్యోగం, ఇంద్రజాలం..

1960 ఏప్రిల్ 8న జన్మించిన రంగనాథ్ ప్రాథమిక విద్యాభ్యాసం ఆర్మూర్‌లో, ఉన్నత విద్య నిజామాబాద్ జీజీ కాలేజీలో, ఎంఏ సైకాలజీ ఓయూలో చదివారు. అనంతరం 1982లో తపాలాశాఖలో పోస్టల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం రావటంతో ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు తన కళ అయిన మెజీషియన్ నేర్చుకుని 10వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ప్రముఖ మెజీషియన్ డాక్టర్ క్యాసినో ఇచ్చిన ప్రదర్శన చూశాక తాను కూడా మెజీషియన్ కావాలని ఆ కళపై మక్కువ పెంచుకున్నాడు. ఓ సారి పెర్కిట్‌లో ఇంద్రజాలికుడు రాకెట్ రాజా ఇచ్చిన ప్రదర్శన రెండుసార్లు చూసి ప్రేక్షకులంతా వెళ్లిపోయినా ఆయన అక్కడే ఉండిపోయాడు. అనంతరం రాకెట్ రాజా నిర్దేశకతలో మ్యాజిక్ నేర్చుకోగా, తెనాలిలో జాదు టైగర్ రామలింగేశ్వర్‌రావు వద్ద ఇంద్రజాలం నేర్చుకుని పూర్తిస్థాయి మెజీషియన్‌గా మారారు.

అలరించిన ప్రదర్శనలు..

రంగనాథ్ మెజీషియన్ రంగంలో 10వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. రచయితగా 38 నాటకాలు రాయగా, కొన్ని నాటికలు ఎఫ్‌ఎం రేడియోలో ప్రసారమయ్యాయి. ఈయన ప్రదర్శనలకు మెచ్చి ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్నో అవార్డులు, పురస్కారాలతో సత్కరించింది. అక్కినేని నాగేశ్వర్‌రావుతో అవార్డు అందుకోవటం మరచిపోలేని ఘటన అని ఆయన అన్నారు. 1995 లో బజాజ్ స్కూటర్ కంపెనీ ఆధ్వర్యంలో కండ్లకు గంతలు కట్టుకుని నగరంలో పలువీధుల గుండా స్కూటర్‌ను నడిపి తన ప్రదర్శనతో అబ్బురపరిచారు.

కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు

సైకాలజీలో పట్టా అందుకున్న రంగనాథ్ రిలాక్స్ సైకాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఎంతోమందికి కౌన్సెలింగ్ చేస్తున్నారు. అలాగే చదువులో ఒత్తిళ్లను ఎలా తగ్గించుకోవాలో విద్యార్థులకు, యువకులకు అవగాహన కల్పిస్తున్నారు. తనతోనే ఇంద్రజాలం ప్రదర్శనలు ఆగిపోకుండా మరో ఇద్దరు చందన శ్రీనివాస్, వాల్గొట్ రాజులతో ఇంద్రజాల ప్రదర్శనలు నేర్పిస్తున్నారు.

మ్యాజిక్‌తో 'సంతోషం' పంచుతూ..

భిక్కనూరు: పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నాడు భిక్కనూరు మండలం కంచర్లకు చెందిన ఇంద్రజాలికుడు సంతోష్. టీవీల్లో మెజీషియన్ సామల వేణు మ్యాజిక్‌ను చూసి ఇంద్రజాలికుడిగా మారాలని నిర్ణయించుకున్న సంకల్పాన్ని చేరుకున్నాడు. కంచర్లకు చెందిన సంతోష్ ఏడో తరగతి వరకు గ్రామంలో, పదో తరగతి వరకు పెద్దమల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో విదనభ్యసించాడు. దోమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతుండగా ఆటోలో ప్రయాణిస్తుండగా ఎదురుగా వస్తున్న ఓ వాహనం వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో సంతోష్ కాళ్లు, చేతులు విరిగిపోవడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. తనకంటు ఒక గుర్తింపు తెచ్చుకోవాలనే ఉద్దేశంతో తన శరీరంలో రాడ్లు ఉన్నా కూర్చోడానికి వీలుకాకున్నా పట్టుదలతో మిమిక్రీని నేర్చుకున్నాడు. 2015లో పొట్టి శ్రీరాములు తెలుగు యునివర్సిటీలో ఇంద్రజాలం కోర్సును పూర్తి చేశాడు. ఇప్పటి వరకు 275 ప్రదర్శనలు ఇచ్చాడు. ఖాళీ సమయంలో క్యాటరింగ్ బాయ్‌గా పనిచేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కామారెడ్డి జిల్లాలో ఉన్న ఒకే ఒక మెజీషియన్ సంతోష్. జాతీయ గోల్డెన్ స్టార్ అవార్డు, రాష్ట్రస్థాయిలో అబ్దుల్ కలాం అవార్డు, స్టార్ మెజీషియన్ అవార్డు, తెలంగాణ కళారత్న అవార్డులు పొందాడు. కామారెడ్డి తొలి కలెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా ఉత్తమ మెజీషియన్ అవార్డును సైతం పొందాడు.



సినీనటుడు బాబూమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సంతోష్

ఇస్కాన్ మందిరంలో శ్రీనిత్యానంద త్రయోదశి

● హరినామ సంకీర్తనను పంచిపెట్టడమే లక్ష్యం: రామానందరాయ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) కంఠేశ్వర్ ఆధ్వర్యంలోని ముబారక్‌నగర్‌లో ఉన్న శ్రీకృష్ణ మందిర్‌లో గురువారం శ్రీ నిత్యానంద త్రయోదశి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తిప్రపత్తులతో పూజలు, కీర్తనలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇస్కాన్ కంఠేశ్వర్ ఇందూరు కమిటీ అధ్యక్షుడు రామానందరాయ్ గౌరదాస్ మాట్లాడుతూ.. కలియుగంలో బలరాముడు నిత్యానంద ప్రభుగా, శ్రీకృష్ణుడు చైతన్య మహాప్రభుగా 500 ఏళ్ల క్రితం జన్మించారన్నారు. కలియుగంలో భగవన్నామ సంకీర్తనను వీళ్లే మొదటగా ప్రచారం చేశారన్నారు. హరినామ సంకీర్తన ప్రపంచానికి పంచిపెట్టాలన్న వీరి లక్ష్యానికి అనుగుణంగా ప్రస్తుతం ఇస్కాన్ ఆధ్వర్యంలో నిరంతరం సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. హరినామ సంకీర్తన చాలా ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో రామానందరాయ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్, నరేశ్, బలరాం పాల్గొన్నారు.



ఉద్యోగాల పేరిట మోసం

- సబ్‌స్టేషన్ ఆపరేటర్ పోస్టు ఇప్పిస్తానని..
- ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షలు వసూలు చేసిన ఏఈ
- ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన వైనం

నిజామాబాద్‌నాగారం: ఉద్యోగాల పేరిట ఓ విద్యుత్‌శాఖ అధికారి నిరుద్యోగులను మోసిన చేసిన ఘటన జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యుత్‌శాఖలో సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ జిల్ల కేంద్రానికి చెందిన ఏఈ నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి సుమారు రూ. 60 లక్షల వరకు వసూలు చేశఋూరు. తీరా కాలం వెళ్లదీస్తుండడంతో విసిగిపోయిన నిరుద్యోగులు ఇటీవల విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో సదరు అధికరిపై విచారణకు ఆదేశాలు ఇచ్చిన్నట్లు తెలిసింది.

జరిగింది ఇలా..

నగరంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఏఈ గతంలో నవీపేట్ మండలంలో ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వర్తించారు. అదే సమయంలో సుమారు 60 మంది నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి సబ్‌స్టేషన్‌లలో ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ. 2లక్షలు చొప్పున వసూళ్లు చేశారు. గత ఎనిమిదేళ్లుగా వారిని మభ్యపెడుతూనే ఉండడంతో విసిగిపోయిన వారు ఎస్‌ఈకి ఫిర్యాదు చేశారు. దీంతో పాటు సదరు ఏఈ మాక్లూర్ మండలానికి ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వహించే సమయంలో ఓ ఉద్యోగి జైలులో ఉన్నా హాజరు వేసి పూర్తి జీతం ఇచ్చారని, ఇందుకోసం పెద్ద ఎత్తున ఆమ్యాయాలు అందుకున్నట్లు తెలిసింది.

విచారణకు ఆదేశాలు...

ఏఈపై ఫిర్యాదు రావడంతో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్ విచారణ చేయాలని నిజామాబాద్ డివిజన్ డీఈ శ్రీనివాస్‌రావును ఆదేశించారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను అందజేయాలన్నారు. సదరు డీఈ శ్రీనివాస్‌రావు ప్రాథమిక విచారణ చేయాలని నవీపేట్ ఏడీఈ సుహాసినిని ఆదేశించారు.

అధికారుల అండతో పక్కదారి పడుతుందా...!


అవినీతికి పాల్పడిన సదరు ఏఈకి జిల్లాలో ముఖ్యమైన అధికారుల అండదండలు బాగానే ఉన్నాయని శాఖలో చర్చించుకుంటున్నారు. అందుకే ఫిర్యాదులు వచ్చినా చూద్దాం లే అన్నట్లు వ్యవహారిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇదికాక ఫిర్యాదు చేసిన వ్యక్తిని సైతం మేనేజ్ చేయడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

విచారణకు ఆదేశించాం

నగరంలో ఓ ఏఈపై ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూళ్లు చేశారని నిరుద్యోగులు ఫిర్యాదు చేశారు. మాక్లూర్ మండలంలో ఇన్‌చార్జి ఏఈగా చేసిన సమయంలో జరిగిన అవినీతిపై విచారణ చేపడుతాం, నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటాం.

–రవీందర్, ఎస్‌ఈ, విద్యుత్‌శాఖ

నేడు రథోత్సవం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో నిర్వహిస్తున్న తిరుక్కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలను రథోత్సవం కోసం సిద్ధం చేశారు. ఈ రథోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరవుతారని ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య తెలిపారు.

ఘనంగా గరుడ సేవ

రామాలయంలో జరుగుతున్న తిరుక్కళ్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం హోమం, సదస్యం, సాయంత్రం గరుడ సేవ నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, సర్పంచ్ గడ్డం రాధకిష్టారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు పి.మహేందర్‌రెడ్డి, దువ్వ నర్సయ్య, గురడి నర్సారెడ్డి, వీడీసీ సభ్యులు వారాల సాయిలు, తోట చిన్న సాయిలు, మాజీ సర్పంచులు బూస సుదర్శన్, ఏజీదాస్, డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక

మోపాల్: సెపక్‌తక్రా జిల్లా జట్లను గురువారం ఎంపిక చేశారు. మండలంలోని మోపాల్ శివారులోగల ప్రెసిడెన్సీ పాఠశాలలో సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి టోర్నీకి సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. మొత్తం 46 మంది క్రీడాకారులు హాజరు కాగా ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదా రి సంజీవ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో నల్గొండలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో ఈ జ ట్లు పాల్గొంటాయన్నారు. ప్రెసిడెన్సీ పాఠశాల ప్రి న్సిపాల్ పవన్‌కుమార్, అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు దీపిక, కార్యనిర్వాహణ కార్యదర్శి చామకూర బాగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మణ్, సరళ, సంఘ బాధ్యులు నబీ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

ఎంపికైన క్రీడాకారులు..

జూనియర్ బాలుర విభాగంలో ఉదయ్‌కుమార్, హనోక్, రాహుల్, జైల్‌సింగ్, నెహ్రూ, బాలికల విభాగంలో రిక్కి రెడ్డి, శ్రీజ, శ్రేష్ఠ, లాస్య ప్రియ, అక్షర, లాస్య శ్రీ, రిషిత ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో భవిక్, ప్రణయ్ వంశీ, మిథు న్ తేజ, సాత్విక్, అర్జున్, వర్షిణి, యోగేశ్వరి, మన్విత, మన్వి, భవ్య, శ్రీరెడ్డి ఎంపికయ్యారు. కోచ్, మేనేజర్లుగా గాదారి సంజీవ్‌రెడ్డి, ఎల్ శ్రీనివాస్, సరళ, కల్యాణ్ వ్యవహరించనున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



నవీన్ (ఫైల్)

నవీపేట: యంచ శివారులోని గోదావరి నదిలో రెడ్డి నవీన్(35) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కోటగల్లీకి చెందిన రెడ్డి నవీన్‌కుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాలేయ సంబంధిత వ్యాధితో జీవితంపై విరక్తి చెందిన రెడ్డి నవీన్ ఈనెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. గోదావరి నదిలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టగా నవీన్ మృతదేహంగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుడి భార్య వసుంధర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గోదావరిలో దూకి ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని కోటగల్లీకి చెందిన గంగారెడ్డి(34) బాసర నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిలో మృతదేహం ఉందన్న సమాచారం కోసం నవీపేట్ పోలీసులు ఘటన స్థలానికి విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు ఆర్థిక, ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, కుమారులు ఉన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి..



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని అర్సపల్లి ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి



సాయిబాబా(ఫైల్)

ఎల్లారెడ్డి: ప్రమాదవశాత్తు నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని జంగమాయిపల్లి శివారులో చోటు చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చాకలి కళవ్వను లింగంపేట మండలంలోని షెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన సాయిబాబా(30) వివాహం చేసుకొని ఇల్లరికం వచ్చాడు.బుధవారం పొలానికి నీరు పెట్టి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన సాయిబాబా తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో ఉదయం మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు వెళ్లి విచారణ చేపట్టగా సాయిబాబా మృతదేహంగా గుర్తించినట్లు తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకునే సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి మహిళ..

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లి సమీపంలో ఉన్న పల్లెవాని కుంట వద్ద గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సుంకం విజయ (38) ఉదయం 10 గంటల ప్రాంతంలో పేడ తీసుకురావడానికి దగ్గరలోని చెరువు వద్దకు వెళ్లగా చేతులు కడుక్కునేందుకు కుంటలోకి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందింది. ఘటనా స్థలాన్ని దేవునిపల్లి ఎస్సై రాజు పరిశీలించి విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టిప్పర్ ఢీకొనడంతో కారు అద్దాలు తుడిచే వ్యక్తి..

ఆర్మూర్‌టౌన్: కారు అద్దాలు తుడిచి డబ్బులు అడుక్కునే ఓ వ్యక్తిపై టిప్పర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో గురువారం చోటు చేసుకుంది. టీచర్స్ కాలనీలోని కెనాల్‌పై నివసించే శివరాం(32) ప్రతి రోజు మామిడిపల్లి చౌరస్తా సిగ్నల్ వద్ద కారు అద్దాలు తుడుస్తూ డబ్బులు అడుక్కునేవాడు. ఓ కారు అద్దాలు తుడిచి డబ్బులు అడిగే క్రమంలో కారు వెంట వెళ్లిన శివరాంపై వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..



హైమద్

నందిపేట్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మండల కేంద్రానికి చెందిన హైమద్ (33) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మంగళవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అభంగపట్నంలో ఆర్‌ఎంపీ..

నవీపేట: మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు బూస కిషన్(70) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. మండలంలోని అభంగపట్నం గ్రామంలో ఆర్‌ఎంపీగా పని చేసే బూస కిషన్ ఈనెల 7న నవీపేట నుంచి అభంగపట్నంకు స్కూటీపై వస్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో కిషన్ తలకు తీవ్రగాయమైంది. కిషన్‌ను ఆస్పత్రికి తరలించగా బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాన్కంపల్లి ఖుర్దులో గుడిసె దగ్ధం



ఎల్లారెడ్డిరూరల్: ప్రమాదవశాత్తు నివాసపు గుడిసె కాలిపోయిన ఘటన మండలంలోని జాన్కంపల్లి ఖుర్దు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని మూడ్ బిక్యాకు చెందిన నివాసపు గుడిసెపై విద్యుత్ లైన్ ఉండగా అకస్మాతుగా స్పార్క్ అయి మిరుగులు గుడిసెపై పడడంతో కాలి పోయినట్లు తెలిపారు. ప్రమాదంలో ఇంటిలోని వస్తువులు కాలిబూడిదైనట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం అందించాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.

పాఠశాల బస్సును ఢీకొన్న లారీ

● నలుగురు విద్యార్థులకు గాయాలు



ఎల్లారెడ్డి: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సును లారీ ఢీకొనడంతో నలుగురు విద్యార్థులకు గాయాలైనట్లు స్థానికులు గురువారం తెలిపారు. పట్టణంలోని జీవదాన్ పాఠశాలకు చెందిన బస్సులో విద్యార్థులను సాయంత్రం పాఠశాల ముగిసిన అనంతరం వారి ఇంటికి తరలించే సమయంలో ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపునకు చెరుకు లోడుతో వెళ్తున్న లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వారిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మహిళ మృతదేహం లభ్యం

వేల్పూర్: మండల శివారులోని అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వినయ్‌కుమార్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం చెక్కి క్యాంపునకు చెందిన అనసూయ(45) ఈ నెల 19న అదృశ్యమైనట్లు ఆమె కుమారుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు అనసూయ నిజామాబాద్ నుంచి కమ్మర్‌పల్లి బస్సు ఎక్కగా వేల్పూర్ మండలంలోని లక్కోరా శివారులో బస్సు దిగినట్లు సెల్‌ఫోన్ సిగ్నల్ ద్వారా గుర్తించారు. వేల్పూర్ అటవీ ప్రాంతంలో కుళ్లిపోయిన మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు అనసూయ మృతదేహంగా అనుమానించారు. దీంతో వారు కుటుంబీకులకు సమాచారం అందించగా వారు అనసూయ మృతదేహంగా గుర్తించారు. మృతదేహం కుళ్లిపోవడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

నిందితుడి అరెస్ట్

కామారెడ్డి క్రైం: మూసి ఉంచిన దుకాణాలను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని కామారెడ్డి పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 31న రాత్రి జిల్లా కేంద్రంలోని ఇంటర్‌నేషనల్ హోటల్ పక్కన ఉన్న మహాలక్ష్మి టైల్స్ దుకాణంలో చోరీ జరిగింది. ఇందులో రూ.40లు నగదు చోరీకి గురయ్యాయి. యజమాని ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు నమోదు చేసి విచారణ చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడిని సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన పాత నేరస్తుడు అందోల్ నవీన్‌గా గుర్తించారు. అతనిపై నిఘా ఉంచిన పోలీసులు జిల్లా కేంద్రంలో తిరుగుతుండగా గురువారం పట్టుకున్నారు. అతడిని విచారించగా నేరం అంగీకరించనట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. దీంతో పాటు ఈ నెల 16న ములుగు జిల్లా మేడారం గ్రామంలో ఇదే తరహాలో కొబ్బరికాయ దుకాణంతో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అనంతరం నిందితుడి నుంచి రూ. 1.96లక్షల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

కామారెడ్డి క్రైం: తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ రాత్రి సమయంలో దొంగతనాలు చేస్తున్న నిందితుడిని దేవునిపల్లి పోలీసులు గురువారం సాయంత్రం అరెస్ట్ చేశారు. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కాకతీయనగర్ కాలనీకి చెందిన షేక్ సలీం కొంతకాలంగా ఆయా ఆయా జిల్లాలలో తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడగా 13 కేసులు నమోదయ్యాయి. నిందితుడిని గురువారం అరెస్టు చేసి విచారణ చేపట్టారు. మేడ్చల్ పీఎస్‌లో ఆరు, చిలకలగూడలో ఒకటి, గోదావరిఖనిలో ఆరు కేసులు నమోదైనట్లు ఎస్సై పేర్కొన్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.